# నేలతల్లి

జానకిరామయ్యగారి ఇల్లు ఒకప్పుడు పాడిపంటలతో, పిల్లా పాపలతో కళకళలాడుతూ వుండేది కానీ ఇప్పుడు పూర్వపు కళాకాంతులు కోల్పోయినాదానిలా నిశ్శబ్దంగా బూజుపట్టినగోడలతో పెంకులూడిన పైకప్పుతో సగం సగం కూలిన ప్రహరీగోడలతో దీనంగా నిల్చున్నట్లుంది.

జానకిరామయ్య ఆరు ఎకరాల మాగాణీపొలం వున్న రైతు. నేలతల్లినే నమ్ముకుని స్వంత వ్యవసాయం చేసుకుంటూ తన నలుగురు పిల్లలనీ పెంచి పెద్దచేశారు. పెద్దకొడుకు రఘురాం ఇంజనీరింగ్ చదువుతానని పట్టుబడితే తనకి ఎత్తరాని భారం అయినా అన్నింటికీ ఆ దేవుడే వున్నాడు అని ధైర్యం చేసి రెండెకరాలపొలం అమ్మి కొడుకు చదువు పూర్తి చేయించాడు.

అందంగా, ఆకర్షణీయంగా వుండి ఇంజనీరింగ్‌పూర్తిచేసిన రఘురాం చాలామంది ఆడపిల్లల తండ్రుల కళ్ళలోపడ్డాడు. అయితే ఆ పోటీలో అతితెలివీ 'లౌక్యం' తెలిసిన సూపరెంటెంట్ ఇంజనీర్ సుధాకరంగారి అల్లుడైపోయాడు.

"కట్నకానుకలు అక్కరలేదు. మాకు కావల్సింది మహాలక్ష్మిలాంటి కోడలు" అంటూన్న జానకిరామయ్యగారి అమాయకత్వాన్ని క్షణంలో గ్రహించేసి-

"మీ కొడుక్కి మాంచి ఉద్యోగం ఇప్పిస్తాను. మీ కుటుంబభారాన్ని అతని భుజాలకి ఎత్తేస్తాను. ఇంక మీ భార్యాభర్తలిద్దరూ కృష్ణారామా అనుకుంటూ విశ్రాంతిగా కొడుకు దగ్గర కాలం వెళ్ళదీసే ఏర్పాటు చేస్తాను" అని చాలా చాలావాగ్దానాలు గుప్పించాడు.

జానకిరామయ్య మహాసంతోషపడిపోసాగాడు. తను ఒట్టి పల్లెటూరి రైతు మాత్రమేగా. ఉన్న పొలం అమ్మి చదువు చెప్పించగలిగాడు కానీ మంచి ఉద్యోగం ఇప్పించుకోలేడుగా. పెద్ద వాడికి మంచి ఉద్యోగం వస్తే చిన్నవాడి చదువు బాధ్యతా, ఆఖరమ్మాయి జలజ పెళ్ళి బాధ్యతా కొడుకు చూసుకొంటాడుగా అన్న ధైర్యంతో ఆయన సంతృప్తిపడిపోయాడు.

"పెళ్ళి కూతురు అందాల బొమ్మలా ఉంది ఆపిల్ల తన నట్టింట్లో తిరిగితే అంతే చాలు" అని మురిసిపోయింది సుందరమ్మ.

## 2

రఘురాం పెళ్ళి ఆర్భాటంగా జరిపించారు సుధాకరం గారు.

"అమ్మాయిని తీసుకెళ్ళి మా ఇంట్లో గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం చేసుకోవడం మా ఆచారం. కోడలిని పంపండి" అన్నారు. జానకిరామయ్యగారు.

సుధాకరంగారు పెద్దగా నవ్వి 'ఆ పల్లెటూరికా మా అమ్మాయినా పంపాలా! మాకలాంటి ఆచారాలు లేవు కదండి. అందుకని అల్లుడినీ అమ్మాయినీ హనీమూన్ పంపే ఏర్పాట్లు చేసేశాను. ఈ రాత్రికే వాళ్ళిద్దరూ వెళ్ళిపోతున్నారు" అన్నారు తాపీగా.

జానకిరామయ్యకి పిచ్చికోపం వచ్చింది.

"నాకు తెలియకుండా హనీమూన్ ఏర్పాట్లు ఎవరు చెయ్యమన్నారు" బిగ్గరగా అరిచాడు.

"హుష్. ఏమిటా అరుపులు. ఇది పల్లెటూరు కాదు బస్తీ. ఇక్కడి అలవాట్లు కూడా మీరు అర్థం చేసుకోవాలి. ఇవన్నీ సరే ఇంక ఈ కళ్యాణమండపం ఖాళీ చేసే టైము అయింది. మరి మీరు. మీ ఊరికి వెళ్ళే ఏర్పాట్లు ఏమిటో చూసుకోవాలి" శాంతంగా అన్నారు సుధాకరంగారు.

జానకిరామయ్య అవమానభారంతో బంధువులని తీసుకొని బయలుదేరుతూ కొడుకు కోసం వెతికారు.

పెళ్ళికొడుకు పెళ్ళికూతుర్ని తీసుకొని ఎక్కడికో షికారుకెళ్ళిపోయాడు అని తెలిసి మరీ బాధపడిపోయి అయినా వెతికివెతికి వేసారి స్వంత ఊరుకి వచ్చేశారు.

పల్లెటూరు కావటాన ఒక్కొక్కరూ వచ్చి "కొత్త కోడలు ఏదీ ఒదినమ్మా" "కొత్త కోడలేదీ అక్కాయ్" అన్న ప్రశ్నలకి జవాబు చెప్పలేక సతమతమవుతూన్న భార్యని జాలిగా చూస్తూ "సుందరీ! నిజం చెప్పేయి" అన్నారు డగ్గుత్తికతో.

ఆ తర్వాత రఘురాం తల్లిదండ్రుల దగ్గరకి రాలేదు. కానీ ఉత్తరం రాశాడు. తనకి మంచి ఉద్యోగం వచ్చిందనీ, భార్యని తీసుకొని కలకత్తా వెళ్ళిపోతున్నాననీ.

ఆ ఉత్తరం చదివిన జానకిరామయ్యగారు గుండె పట్టుకుని కూర్చుండి పోయారు. తను పెద్దకొడుకు మీద పెట్టుకున్న ఆశలు అడియాసలై పోయాయని చాలాసేపు నమ్మకం కలగలేదు.

రఘురాంని బస్తీలో చదివిస్తున్నప్పుడు సెలవలకి ఇంటికి వచ్చినప్పుడు తండ్రితో కలిసి పొలం వెళ్ళేవాడు. కుప్పనూర్చిడి అప్పుడు క్యారియర్‌లో అన్నం తెచ్చేవాడు. తండ్రి ఎత్తలేని బరువులు తను ఎత్తి సాయం చేస్తుంటే జానకిరామయ్య మురిసి పోయేవాడు.

ఈనాడు వీడి చదువుకోసం ప్రాణంకంటే ఎక్కువైన భూమి తల్లిని అమ్ముకున్నానన్న బాధ ఇంక ఉండదు. వాడే నాకు ఆసరా. నా ఇంటిదీపం. వాడికోసం నేను ఏమైనా చేస్తాను అనుకునేవాడు. కానీ ఇలా అవుతుందని అనుకోలేదు.

ఇదంతా కలేమో? లేకుంటే తల్లిదండ్రులంటే, అక్క చెల్లెళ్ళంటే ప్రాణం పెట్టే రఘు ఇలా చేయడమా! నమ్మకం కలగటంలేదు.

"ఒక్కసారి నువ్వూ, నీ భార్యా రండి.మన ఊళ్ళో అందరికీ పెద్దకోడలిని చూపాలని మీ అమ్మ మహా కోరుకుంటూ ఉంది. వస్తున్నానని రాస్తే బస్సు దగ్గరకి బండి పంపిస్తాను" అని రాసిన ఉత్తరం పోస్టు చేసిన దగ్గరనుంచీ కొడుకు జవాబు కోసం ఎదురు చూడసాగాడు.

పోస్టుమేన్ రాంబాబు ఉత్తరాలు పంచుతూ తమ ఇంటికి వచ్చేసరికి ఆలస్యం కావచ్చునని తనే పోస్టాఫీసుకి వెళ్ళేవాడు.

పోస్ట్‌మాస్టరు రంగనాధంగారు ఆత్మీయంగా పలకరించి కాస్సేపు కబుర్లు చెప్పి "మీకేం ఉత్తరం రానట్టుంది" అని చెప్పేసరికి జానకిరామయ్య గారి మనసు ఉస్సురుమంటూ నిట్టూర్చేది. ఎలా ఇల్లు చేరేవారో ఆయనకే తెలియదు.

ఇలా గడచిపోయినాయి ఒక నెలరోజులు.

## 3

కొడుకు దగ్గరనుంచి వచ్చింది ఉత్తరం. వస్తున్నా అని కాదు.

"నాన్నా! నాకు మన ఊరికి రావాలనే వుంది కానీ గీత శ్రీమంతుల బిడ్డ. అయినా నన్నెంతో ప్రేమగా చూస్తోంది. గీత మన ఊరు, మన ఇల్లూ, మన బీదతనంచూస్తే

హేళన చేస్తుంది. అది నేను భరించలేను. అందుకే నేను గీతని అక్కడకి తీసుకురాను. వీలున్నప్పుడు నేను ఒకసారి వస్తాను. అమ్మా, జలజా కులసా అని తలుస్తాను.

ఇట్లు
రఘురాం.

ఉత్తరం చదవడం పూర్తిచేసిన జానకిరామయ్య గారి గొంతు బొంగురుపోయింది. అంతా విన్న సుందరమ్మ కళ్ళనుంచి నీళ్ళు జలజలరాలాయి.

కొడుక్కి పెళ్ళి చేస్తే కోడలు తన కుటుంబంలోకి వచ్చి కలిసి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటుంది అనుకుంది కానీ ప్రాజ్ఞుడైన కొడుకుని గద్దలావచ్చి తన్నుకు పోతుంది అనుకోలేదు.

ఆవిడ కళ్ళు ఇంకా వర్షిస్తూనే వున్నాయి.

ఇంక చిన్న కొడుకు ప్రదీప్ బీకాం పాసైనాడు. "యంకాం చదువుతా నాన్నా" అని అడిగాడు.

"నాకు నిన్ను చదివించాలనే ఉంది. కానీ జలజ పెళ్ళీడుకి వచ్చేసిందిరా ముందు దాని పెళ్ళి చేసేయాలి. నువ్వు ఉద్యోగం చూసుకో."

ప్రదీప్ ఉగ్రుడైపోయాడు. "చెల్లి పెళ్ళికీ నా చదువుకీ సంబంధం ఏమిటి? అన్నయ్యని రెండెకరాల పొలం అమ్మి ఇంజనీరింగ్ చదివించావు. మరినన్ను చదివించలేను అంటున్నావు. ఇదేం ధర్మం నాన్నా?"

"ఏది ధర్మమో ఏది అధర్మమో ఈ పేదరైతు కేం తెలుస్తుందిరా ప్రదీప్. జలజకి మంచి అబ్బాయిని చూడు"

ప్రదీప్ ఆవేశంతో ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. కానీ తర్వాత ఆలోచించి ఆలోచించి చల్లబడిపోయాడు. 'పాపం నాన్న ఏంచేయగలడు' అనుకుని తనే సంబంధం వెతికాడు.

50వేల కట్నం ఇరవైవేల పెళ్ళి ఖర్చుతో జలజ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

రఘురాంకంటే పెద్దదైన అమ్మాయి ఆదిలక్ష్మిని తన మేనల్లుడు విశాలరావుకి పదిహేనేళ్ళ క్రితం పదివేలే కట్నం ఇచ్చి పెళ్ళిచేశాడు.

విశాలరావు ఇప్పుడు పేచీకి దిగాడు.

"జలజకి ఇచ్చినట్లే నాకూ ఇచ్చితీరాలి. కనుక మిగతా నలభైవేలూ పంపమని' ఉత్తరాల మీద ఉత్తరాలు ఉరికిస్తున్నాడు.

ఆరు నెలల లోపల నువ్వు డబ్బు పంపకపోతే మీ అమ్మాయినీ, ఇద్దరి పిల్లలనీ నీ ఇంటికి పంపేస్తాను జాగ్రత్త" లంటూ అల్టిమేటం ఇచ్చేశాడు మేనల్లుడూ అయిన విశాలరావు.

ఇవన్నీ చూస్తున్న ప్రదీప్‌కి విసుగువచ్చి-

ఎంకాం చదివించి మంచి ఉద్యోగం ఇప్పిస్తా నన్న క్రిష్టియన్ దొరసామిరాజు కూతుర్ని శారదని పెళ్ళి చేసుకుంటున్నాని తల్లి దండ్రులతో చెప్పి వెళ్ళి పెళ్ళిచేసుకొని తమ పెళ్ళి ఫొటోలని తల్లిదండ్రులకి పంపిస్తూఉత్తరం రాశాడు.

"నాన్నా! నేను నా భార్యని తీసుకుని మీ దగ్గరకి రాను. ఎందుకంటే పల్లెటూరూ, పాత సాంప్రదాయాలని పట్టుకువేలాడే మీరు నా పెళ్ళిని అంగీకరించలేదు. నాకు జీవితంలో పైకి పోవాలనేఆశ ఉది. మీ అండనే ఉంటే ఆ ఆశతీరదు. అందుకే మన కులం మతం కాని అమ్మాయి అయినా పెళ్ళిచేసుకున్నాను. నా పని తప్పే అయితే క్షమించండి. ఆశీర్వదించండి.

ఇట్లు

మీ ప్రదీప్"

"ఇదేం అన్యాయమండీ" అంటూ బావురుమంది సుందరమ్మ.

"ఇది అన్యాయం కాదే సుందరీ. వాడికి భవిష్యత్తు మనం ఇవ్వలేకపోయాం. వాడే ఈ మార్గాన భవిష్యత్తుని వెతుక్కుంటూ ముందుకు సాగుతున్నాడు. ఇందుకు మనం సంతోషిద్దాం. కానీ చివరికి ఆస్తి హరించుకుపోయింది. పిల్లలూ దూరం అయారు. నా ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంది. నా దిగులు నీవెలా బ్రతుకుతావో అనే" ఆయన ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఒద్దండి అలాంటి మాటలు అనవద్దు" సుందరమ్మ భర్త ఒళ్ళో వాలిపోయింది. ఆరు నెలల తిరక్కుండానే జానకిరామయ్యగారు అనారోగ్యంపాలై ముప్పైయేళ్ళుగా తనకి తోడూనీడగా వున్న సుందరమ్మని ఒదలి ఓ అర్ధరాత్రి కన్నుమూశారు.

కూతుళ్ళు, అల్లుళ్ళూ, పెద్దకొడుకూ వచ్చారు. చేయవలసినదంతా చేశారు.

"అమ్మా! మేం నెలనెలానే కాదు సంవత్సరీకాలూ అవీ అంటూ రాలేం.. పాతకాలం చాదస్తాలు మానేయి. నాన్న పోయినా ఈ ఇల్లు వదలి నువ్వే వుండలేవు." అంటు ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

సుందరమ్మ ఇప్పుడు ఒంటరిదైపోయింది. ఆమెని పలకరించేవాడు పోస్టుమేన రాంబాబు ఒక్కడే. నాలుగు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయినాయి.

## 4

అనుకోకుండా పెద్దల్లుడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"అత్తయ్యా! మేమూ, ప్రదీప్, జలజా కలిసి మీ దగ్గరికి వస్తున్నాం" అంటూ.

ఆ ఉత్తరం చూసి మొదట ఆశ్చర్యపోయింది. తర్వాత ఆనందంతో పొంగిపోయింది. పిల్లలని ముగ్గురినీ ఒక్కసారి కళ్ళు కరువుతీరా చూసుకోవచ్చుకదా అని ఆ రాత్రి అంతా సంతోషంతో నిద్రపట్టలేదు. ఆ సంతోషంలోనూ దిగులు. పిల్లలందరూ వస్తే వాళ్ళకి సౌకర్యాలు చేయడానికి తన దగ్గర డబ్బు ఎక్కడిది? ఆలోచిస్తూ ఆరాత్రి అంతా జాగారం చేసింది.

అలవాటు ప్రకారం రాంబాబు ఉత్తరాలు ఊళ్ళో అందరికి పంచుతూ సుందరమ్మ దగ్గరకి వచ్చాడు.

"రాంబాబు! సాయంకాలం నువ్వు ఈ ఇత్తడి బిందె పట్టుకెళ్ళి అమ్మినేను రాసిన ఈ సరుకులు కాస్త తెచ్చిపెట్టు" అని అడిగింది.

"అలాగేనమ్మా" అంటూ వెళ్ళి తన డ్యూటీ అయిన తర్వాత సుందరమ్మ చెప్పినట్లుగా చేశాడు.

పెద్దకూతురికి కజ్జికాయలంటే ఇష్టమనీ,చిన్నకొడుక్కి బొబ్బట్లంటే ఇష్టమనీ, జలజకి గారెలంటే ఇష్టమనీ పొరుగామె సాయంతో అన్నీచేసి ఉంచింది.

ప్రదీపూ, ఆదిలక్ష్మీ, జలజా, విశాలరావూ బండి దిగారు. అందరికీ కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిస్తూ "పిల్లలేరే" కూతుర్ని అడిగింది. చిన్నకొడుకునీ, ఆఖరికూతుర్నీ కళ్ళ కరువుతీరా చూసుకుంటూ.

"అమ్మా! మరీ ఇంత చిక్కిపోయావేంటీ" జలజ దగ్గరగా వచ్చి తల్లిని పట్టుకు అంది.

"ప్రహరీగోడ అలా పడిపోయిందేమిటే" అన్నాడు ప్రదీప్ ఇల్లంతా తిరిగిచూస్తూ.

కాఫీలు తెచ్చి ఇస్తూ నిర్లిప్తంగా నవ్వింది సుందరమ్మ.

"స్నానాలు చేయండి భోజనాలు చేద్దురుగాని" అంటూ పిల్లలకి కొసరి కొసరి వడ్డించింది. చాలా సంవత్సరాల తర్వాత సంతోషంగా భోజనం చేసింది సుందరమ్మ.

## 5

రెండోరోజు ఉదయం పెద్దల్లుడు విషయం బయటపెట్టాడు.

"అత్తయ్యా మా ముగ్గురికి డబ్బు కావాలి అర్జెంటుగా.అందుకని ఈ ఇల్లు

బేరం పెట్టాను. నలభైవేలుకి ఒక్క పైసా ఎక్కువ ఇవ్వం అన్నాడు భీమారెడ్డి. స్థలం చాలా వున్నా ఇల్లు పాతది అయిపోయిందిగా'' అన్నాడు.

సుందరమ్మ గుండె గుభేలుమంది. 'ఇందుకా మీరంతా కల్సి వచ్చింది' ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరుగుతూండగా మనసులో అనుకుంది.

నాన్న పోయిన ఈ నాలుగేళ్ళుగా నువ్వు ఎలా వున్నావూ ఎలా తిన్నావూ అని పిల్లలు ముగ్గురూ అడుగుతారని ఆశపడింది.

ఆ మాట ఒక్కరూ అడక్కపోగా ఇల్లు అమ్మేసి డబ్బు పట్టుకుపోవటానికి వచ్చిన ఈ పిల్లలు తను పెంచి పెద్దచేసిన వాళ్ళేనా? పిచ్చిదానిలా వారి ముఖాల్లోకి చూడసాగింది.

పోస్టుమేను రాంబాబు కాస్త దూరంగా కూర్చుని వీళ్ళ మాటలు వింటున్నాడు.

''అమ్మా! ఇప్పుడు భీమారెడ్డి డబ్బు అడ్వాన్సు తెస్తాడు. నువ్వు జవాబు చెప్పమ్మా'' ప్రదీప్ విసుక్కుంటూన్నట్లే అన్నాడు.

''ప్రదీపూ! ఆవిడ చెప్పటానికేంవుంది. మనందరితో బాటు సంతకం పెట్టేస్తుంది. రఘురాంకి మనం ఉత్తరం రాసేవున్నాం. మీరంతా ఎలా చేసినా నాకేం అభ్యంతరం లేదని జవాబిచ్చాడు. ఇంకేమిటి' ఆదిలక్ష్మి తమ్ముడిని మందలించింది.

''రాంబాబూ! మన పోస్టుమాస్టరుగారిని ఓసారి పిల్చుకురా'' సుందరమ్మ తల వంచుకునే చెప్పింది.

రాంబాబు అర్థం కానివాడిలా సుందరమ్మ ముఖంలోకిచూసి వెంటనే వెళ్ళిపోయాడు.

''ఇప్పుడు ఆయన ఎందుకమ్మా'' విసుక్కున్నారు పిల్లరు ముగ్గురూ.

సుందరమ్మ జవాబు ఇవ్వలేదు.

''పంచాయితీ పెట్టిస్తున్నారా'' అత్తగారి మీద అల్లుడు గయ్యిన లేచాడు.

''కాదు అల్లుడూ. మీరందరూ ఇలా వచ్చే రోజు ఎప్పుడో ఒకప్పుడు వస్తుందని తెలిసే కాబోలు మీ మామగారు 'పోస్టుమాస్టరుగార్ని పిలు సుందరీ' అన్నారు ఒకసారి కాదు పదిసార్లు. అందుకనీ ఆయనకి కబురంపాను. అంతే'' జీరపోయిన గొంతుకతో అంది సుందరమ్మ.

భీమారెడ్డి పాతికవేలు అడ్వాన్సు తెచ్చాడు. కొత్తనోట్లు రెపరెపలాడుతున్నాయి. ఆదిలక్ష్మి గుండెలో సంగీతం పలికినట్లే వుంది.

ప్రదీప్ ఆలస్యం భరించలేనట్లుగా అసహనంగా ఇటూ అటూ తిరగసాగాడు. జలజ వీధివాకిలివైపే చూడసాగింది.

పోస్టుమాస్టరుగారు, రాంబాబు వెంట లోపలికి వచ్చారు.

ఉప్పొంగి వచ్చే దు:ఖాన్నిఅదుముకుంటూ సుందరమ్మ గోడకి చేరగిలబడి కూర్చుండి పోయింది.

"ఇల్లు అమ్ముకుని వెళ్ళి పోవాలని వచ్చారు. బానే వుంది. మరి మీ అమ్మబాధ్యత ఎవరు తీసుకుంటున్నారు ప్రదీపూ" అడిగారు పోస్టుమాస్టరుగారు.

"నాభార్య కులం మతం వేరు కనుక అమ్మని నేను తీసుకువెళ్ళే ప్రసక్తి లేదు. అక్కా! నువ్వు తీసుకువెళ్ళు"

"ఆ చాలు మీ అక్కకి మాకు వండి పెట్టటానికే ఒళ్లు బద్ధకం. ఇంక మీ అమ్మని మేమేం తీసుకువెళ్లగలం. జలజా! నువ్వు తీసుకువెళ్ళు" పెద్దల్లుడు మరదలి మీదకి నెట్టాడు.

"అమ్మో నా వల్లకాదు ఇప్పటికే నా దగ్గర మా అత్తా, మామా వున్నారు. ఎందరికి చెయ్యనూ" జలజ చెప్పేసింది.

"అమ్మ బాధ్యత నిజం చెప్పాలంటే పెద్ద కొడుకుది. ఆవిడ రఘురాం దగ్గర వుండడమే ధర్మమండీ పోస్టుమాస్టరు గారూ" ఆదిలక్ష్మి ఎదురుగా లేని పెద్ద తమ్ముడి మీదకి తోసేసింది.

"అతను ప్రస్తుతం ఇక్కడలేదుగదమ్మా ఆదిలక్ష్మీ"అన్నారు ఆయన.

"లేకపోతేనేం. ఎప్పుడో ఒకప్పుడు వస్తాడుగా. అంతవరకూ అమ్మ ఎక్కడో ఒకచోట కాలక్షేపం చెయ్యాలి మరి" ఆదిలక్ష్మి తేలిగ్గా అనేసింది.

సుందరమ్మకి పిల్లల మాటలు వినలేక చెవుల మూసుకోవాలనిపిస్తోంది.

"ప్రదీపుబాబూ. ఆదిలక్ష్మమ్మా, జలజమ్మా ఆ ఒక్కతల్లి మీ నలుగురిని కనిపెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి తనకంటూ ఏంలేకుండా చేసుకొని మీ సుఖసంతోషాలనే కోరిందే. అలాంటి ఒక్క తల్లిని అరవై ఏళ్ళు పైబడ్డ వృద్ధురాలిని మీలో ఒక్కరూ దగ్గర వుంచుకోలేరా! ఇదేం ధర్మం బాబూ" ఆవేశంగా అడిగేశాడు రాంబాబు.

"రాంబాబూ! నువ్వు నోరుమూసుకో. ఇవి మా స్వంత విషయాలు " ప్రదీప్ కసురుకున్నాడు.

పోస్టుమాస్టరుగారు అందరినీ శాంతపరిచి అన్నారు.

"ప్రదప్! మీ నాన్న అనారోగ్యం పాలుకాక ముందే వీలునామా ఒకటి రాయించి సీలుచేసి నాకిచ్చారు. అందులో ఏం రాశారో నాకు తెలియదు. ఇదిగో కవరు మీ అందరిముందూ విప్పుతున్నాను. చూడండి" అంటూ తన వెంట సంచీలో తెచ్చిన కవరు బయటికి తీశారు.

"వీలునామానా? ఈ ఇల్లు తప్ప ఏం మిగిలిందని ఆయన వీలునామా రాశాడు" అల్లుడు ఆశ్చర్యంగా చూడసాగాడు. అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, టెన్షన్ చోటుచేసుకుంది.

పోస్టుమాస్టరుగారు కవరులోంచి కాయితం బైటికితీసి "ప్రదీప్ నువ్వు చదువు బాబూ మీ నాన్న స్వదస్తూరీతో రాసిన వీలునామా" అంటూ అందించబోయారు.

"ఒద్దు మా అందరికి ముఖ్యులు మీరే చదవండి" అన్నాడు.

పోస్టుమాస్టరుగారు చదవసాగారు. "నాపిత్రార్జితం అయిన ఆరు ఎకరాల మాగాణీపొలం నలుగురు పిల్లలనీ పెంచి పెద్ద చేయటానికే హారతి కర్పూరంలా హరించుకుపోయింది.

ఈ ఇల్లు నా కష్టార్జితం. ఈ ఇల్లుని నేనూ, నాభార్యా ఇటుక ఇటుకా పేర్చి కట్టుకున్నాం. అందుకని ఈ ఇంటిమీద నాకే సర్వాధికారం వుంది.

నేను ఈ మట్టిమీదే పుట్టి ఈ మట్టిమీదే పెరిగి ఈ నేల తల్లినే నమ్ముకుని బ్రతుకు సాగించాను. పొలం అంతా పోయినా ఈ ఇంటి విశాలమైన పెరడులో వున్న చెట్లూ, వాటి ఫలాలు నాకూ, నాభార్యకీ జీవనాధారం అయ్యాయి.

అందుకే నాభార్య తదనంతరం ఈ ఇంటిని నా ఊరికి సర్వహక్కులతో రాసేస్తున్నాను. ఈ నేలతల్లి రుణం ఈ విధంగా తీర్చుకోవాలన్నదే నా కోరిక.

ఈ ఇల్లుని నా ఊరి ప్రజలకి ఆసుపత్రిగానైనా, స్కూలుగానైనా ఉపయోగించుకో వచ్చును అని పోస్టుమాస్టరుగారికి, కరణంగారికి, సర్పంచుగారికీ అధికారం ఇస్తున్నాను. ఈ ముగ్గురూ కలిసి ఓ మంచిపనికి నా ఇల్లుని ఉపయోగిస్తే నా ఆత్మకి శాంతి కలుగుతుంది.

ఇట్లు

జానకిరామయ్య"

వీలునామా అంతా విన్న భీమారెడ్డి 'భలే బేరం' అనుకుంటూ వెళ్ళిపోయాడు.

"కన్నబిడ్డలకికాక ఊరికి ఈ ఇల్లు దానం చేయడం ఏం ధర్మమమ్మా" అంటూ సుందరమ్మ మీద విరుచుకుపడ్డారు పిల్లలు.

సుందరమ్మ కళ్ళలో ఆశ్చర్యం, ఆనందం ఒక్కుమ్మడి దు:ఖంగా బైటకి తన్నుకొచ్చేశాయి. ఆవిడ ముగ్గురు పిల్లలూ వెంటనే వెళ్ళిపోయారు.

జీవిత సంధ్యాసమయంలో ఆసరా ఇవ్వవలసిన పిల్లలు డబ్బు చేతిలో పడలేదనిఅలిగి వెళ్ళిపోతుంటే ఆవిడ కళ్ళు నీటికుండలే అయినాయి.

"అమ్మా! మీరు కడుపు కట్టుకుని పెంచి పెద్దచేసిన పిల్లలు మిమ్మల్ని ఒంటరిగా ఒదిలి వెళ్ళిపోయారు. కానీ అలా చూడండి. మొన్న గేదెలుపడి సొరపాదంతా తొక్కేసినా, ఆకుల మధ్య ఓ సొరపిందె పెరిగి పెద్దది అవుతోంది. నాలుగు రోజుల తర్వాత దాన్ని అమ్మేస్తే మీకు రెండు రోజులు భుక్తి గడుస్తుంది."రాంబాబు చేత్తో సొరపాదువైపు చూపించాడు.

సుందరమ్మ మెల్లగా లేచివెళ్ళి ఆ పిందెని చేత్తో తడిమిచూసి చేతులెత్తి నమస్కరిస్తూ "నేలతల్లీ నీకు శతకోటి నమస్కారాలమ్మా! నా ఆకలిని తీరుస్తూన్న నీకు' ఆవిడ గొంతు జీరపోయింది. రెడు చేతులలోనూ మట్టినితీసుకుని కళ్ళకి అద్దుకుంటూన్న ఆవిడని అక్కడే వున్న వేపచెట్టు మీదనించి వచ్చిన ఓ పిల్లతమ్మెర ఇలా వచ్చి అలా వెళ్ళింది ఆవిడని సేదదీరుస్తూన్నట్లుగా.

(స్వాతి)